క్లుప్తంగా

30 వరకు ఎల్‌ఆర్‌ఎస్ గడువు పెంపు

మిర్యాలగూడ టౌన్: లే అవుట్ క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) కోసం ప్రభుత్వం ఈనెల 30వ తేదీ వరకు గడువు పొడిగించిందని, ఈ అవకాశాన్ని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ కోరారు. బుధవారం మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో మొత్తం 14,320 మంది దరఖాస్తులు చేసుకోగా 1418 మంది ఫీజు చెల్లించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా 619 మందికి ప్రొసీడింగ్ కూడా ఇచ్చినట్లు చెప్పారు. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా ఫీజు రూ. 9కోట్ల 3లక్షల ఆదాయం వచ్చిందన్నారు. 8064 మంది వరకు ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయని, 3685 వరకు నిషేధిత ప్రాంతాలుగా ఉన్నాయన్నారు. 33 దరఖాస్తులను పూర్తిగా రిజెక్ట్ చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ఆస్తి పన్ను బకాయిదారులకు పన్నుల చెల్లింపులో 5శాతం (ఎర్లీబర్డ్) రాయితీని కల్పించడం జరిగిందని పేర్కొన్నారు.

పేదలకు మేలు

నిడమనూరు: సన్న బియ్యం పంపిణీతో పేదలకు మేలు జరుగుతుందని తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. నిడమనూరు మండలంలోని ముప్పారం, నందికొండవారిగూడెం, ఊట్కూరు, శాఖపురం గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణయ్య, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఎడవెల్లి వల్లభరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఉపసర్పంచ్ శేషరాజు దాసు, కళ్ల పురుషోత్తం రెడ్డి, కార్యదర్శి నరసింహాచారి, నందికొండ మట్టారెడ్డి, నర్సింగ్ విజయకుమార్, మేరెడ్డి విజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీ

మాడుగులపల్లి: పేదలకు సన్న బియ్యం పంపిణీ పథకాన్ని బుధవారం మాడుగులపల్లి మండల కేంద్రంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వెంకన్నయాదవ్, బోడ యాదయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు కొండేటి శంకర్, చింతరెడ్డి సైదిరెడ్డి, చెన్నయ్య, దుర్గయ్య, సతీష్, ఉపేందర్ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

డిండి: జిల్లా కేంద్రంలో ఈనెల 12న నిర్వహించనున్న భవన నిర్మాణ కార్మిక సంఘం 7వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం డిండి మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు బూషిపాక సాయిలు, కార్యదర్శి ఎలిమినేటి దేవయ్య, లింగమయ్య, తిర్పతయ్య, పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలో భాగంగా బుధవారం ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఆయా పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పట్టణంలోని అభ్యాస్, శ్రీచైతన్య, కృష్ణవేణి, శివాని, ఎస్‌పీఆర్ పాఠశాలలను వారు తనిఖీ చేసి పరీక్షా నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట కొమ్ము శ్రీను, నల్లగొండ టూటౌన్ ఎస్ఐ శ్రీను, మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు ఉన్నారు.

రైతుల్లో వడగండ్ల గుబులు


కృష్ణపట్టెలో కోత దశలో ఉన్న వరి పంట

నాగార్జునసాగర్ : యాసంగి పంటలు చేతికొచ్చే దశలో అల్పపీడన ప్రభావంతో వడగండ్లు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలతో రైతుల గుండెల్లో కలవరం మొదలైంది. కృష్ణపట్టెలోని పెద్దవూర, పీఏపల్లి, తిరుమలగిరి(సాగర్), నిడమనూరు, అడవిదేవులపల్లి, దామరచర్ల తదితర మండలాల్లో వరితో పాటు వాణిజ్య పంటలైన బత్తాయి, మిరప పంటలు చేతికొచ్చే దశలో ఉన్నాయి. ఇప్పుడు వడగండ్ల వానలు కురిస్తే పంటలు నేలపాలవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. నాలుగేళ్ల క్రితం ఇదే సమయంలో కురిసి వడగండ్ల వానకు బత్తాయి తోటల్లోని చెట్లు విరిగి.. కాయలు రాలిపోయాయి రైతులు భారీస్థాయిలో నష్టాలు చవిచూశారు. మళ్లీ అలాంటి పరిస్థితి రావొద్దని రైతులు కోరుకుంటున్నారు.

అతివేగంతోనే ప్రమాదాలు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఆటో డ్రైవర్లు పరిమితికి మించి అతివేగంగా నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఎస్ఐ వీరశేఖర్ అన్నారు. బుధవారం తిరుమలగిరి మండలంలోని ఆటో డ్రైవర్లకు శ్రీనివాస ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రతపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే డ్రైవర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. డ్రైవర్లు విధిగా లైసెన్సులు కలిగి ఉండాలని, మైనర్లు వాహనాలు నడిపితే సీజ్ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆస్తిపన్నుపై 5శాతం రాయితీ

- ఎర్లీబర్డ్‌తో ఈనెల 30వరకు అవకాశం
- పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు



మిర్యాలగూడ టౌన్: మున్సిపాలిటీలో ఆస్తిపన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం 5 శాతం (ఎర్లీబర్డ్) రాయితీని ప్రకటించింది. 2025–2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లించే వారికి ఈ అవకాశాన్ని కల్పించింది. ఈనెల 30వ తేదీ లోగా చెల్లించిన వారికి రాయితీ వర్తిస్తుంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను మున్సిపల్ శాఖ కమిషనర్‌కు జారీ చేసింది.

ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు

మున్సిపాలిటీలో ఈ ఏడాది కరెంట్, ఏరియర్స్ (పాత బకాయిలు)తో కలుపుకుని మొత్తం రూ.25 కోట్ల 63లక్షల 16 వేలు డిమాండ్ ఉంది. ఎలాంటి రాయితీలు లేకుండా వసూలు చేయడంతో పాటు మార్చి 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 90శాతం వడ్డీ రాయితీ కింద స్పెషల్ డ్రైవ్ ద్వారా ఇప్పటి వరకు రూ.11కోట్ల 32లక్షలు వసూలు చేశారు. ఇంకా సుమారు రూ.12 కోట్ల 31 లక్షల వరకు వసూలు చేయాల్సి ఉంది. దీంతో మున్సిపల్ శాఖ వారు 5శాతం రాయితీపై వసూలు చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం పేరుకుపోయిన బకాయిదారుల నుంచి ఆస్తి పన్ను వసూలు చేసేందుకు సీడీఎంఏ అధికారులు మార్చి 21వ తేది నుంచి 31వ తేది వరకు 90శాతం రాయితీ అవకాశాన్ని కల్పించగా చాలా మంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయారు. దీంతో 5 శాతం రాయితీని కల్పిస్తూ ప్రభుత్వం అవకాశాన్ని కల్పించింది. మున్సిపాలిటీలో రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్(మిక్సింగ్), రాష్ట్ర గవర్నమెంట్, కేంద్రం ప్రభుత్వానికి సంబంధించిన పన్నులు వసూలు చేయాల్సి ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి



మున్సిపాలిటీలో ఆస్తిపన్ను బకాయిదారులకు 5శాతం రాయితీతో పన్నులు చెల్లించేందుకు ప్రభుత్వం మరో అవకాశాన్ని కల్పించింది. ఆ దిశగా వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రధానంగా వార్డుల్లో చెత్త వాహనాలకు ఏర్పాటు చేసిన మైకుల ద్వారా ప్రతి రోజు ప్రచారం చేస్తున్నాం. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

ధాన్యం కొనుగోళ్లతో రైతులకు మేలు


ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, ఎడవెల్లి వల్లభరెడ్డి

నిడమనూరు: ధాన్యం కొనుగోళ్లతో రైతులకు మద్దతు ధర, బోనస్ లభిస్తోందని మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఎడవెల్లి వల్లభరెడ్డి అన్నారు. బుధవారం ముప్పారం, ఊట్కూరు, ఎర్రబెల్లి గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులు, మహిళా సమాఖ్య సభ్యులతో కలిసి చైర్మన్ అంకతి సత్య, వల్లభరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు నందికొండ మట్టారెడ్డి, ఊట్కూరు మాజీ సర్పంచ్ నర్సింగ్ విజయ్, ఏపీఎం లక్ష్మీనారాయణ, బాలు నాయక్, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూములను విక్రయించొద్దు

నిడమనూరు: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను విక్రయించొద్దని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. నిడమనూరులో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో వర్సిటీ భూముల విక్రయాలపై కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం వర్సిటీ భూములను విక్రయించొద్దన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు కొమాండ్ల గురువయ్య, మల్లికంటి చంద్రశేఖర్, ఆకారపు నరేష్, కుంచెం శేఖర్, శివ, బాలనారాయణ తదితరులున్నారు.


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

- ఏఎస్పీ మౌనిక


కరపత్రం ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ

కొండమల్లేపల్లి: ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని దేవరకొండ ఏఎస్పీ మౌనిక అన్నారు. పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి కొండమల్లేపల్లి మండలంలోని చెన్నంనేనిపల్లి గ్రామంలో విలేజ్ పోలీసు అధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈనెల 5న నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మైనర్లకు తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు ఇవ్వకూడదన్నారు. మాదక ద్రవ్యాల బారిన పడితే జరిగే దుష్ప్రభావాలను వివరించారు. అనంతరం జాబ్ మేళా కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దూదిపాల రేఖశ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ రామ్మూర్తి, మాజి సర్పంచ్ వెంకట్‌రెడ్డి, పోలీసు సిబ్బంది హేమనాయక్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

గుర్రంపోడు: మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల హామీని తుంగలో తొక్కిందని, మార్చి 31 నాటికి రైతులందరికీ రైతు భరోసా వేస్తామని మరోసారి రైతాంగాన్ని మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆరోపించారు. బుధవారం గుర్రంపోడు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని , రుణం ఎంత ఉన్నా రెండు లక్షల వరకు మాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు రెండు లక్షల లోపు రుణాల మాఫీకే పరిమితం చేయడం మోసగించడమేనన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలను ఎలాంటి కొర్రీలు పెట్టకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇవ్వాలన్నారు. అంతకు ముందు మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నాగులవంచ తిరుపతిరావు, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ పామనగుండ్ల వెంకన్న, మాజీ ఎంపీపీ శ్యామల బొజ్జయ్య, నాయకులు నాగులవంచ నాగేశ్వర్‌రావు, కామెళ్ల రాములు, మేకల వెంకట్‌రెడ్డి, షేక్ సిరాజ్, కూనూరు సైదిరెడ్డి, చంటి, సంకటి గిరి, వనమాల మహేందర్, వాకిటి చంద్రయ్య, జాల మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చేందుకే సన్నబియ్యం పంపిణీ

- ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి


తిరుమలగిరి: లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం దొడ్డు బియ్యానికి బదులుగా సన్న బియ్యం పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అన్నారు. సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం తిరుమలగిరి మండల కేంద్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి కృషి చేస్తోందని అందులో భాగంగానే ఉచిత బస్సు, రూ. 500 గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి, రైతులకు బోనస్, రైతు భరోసా వంటి పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. పేదల సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మద్దతిచ్చి మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

పారదర్శకంగా నిర్వహించాలి

సన్నబియ్యం పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. తిరుమలగిరి మండలంలోని రేషన్ దుకాణాల్లో ఖాళీలను యుద్ధ ప్రతిపాదికన భర్తీ చేయాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్‌ను ఆదేశించారు. రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని, కొత్త రేషన్ కార్డుల కోసం మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతులు సన్నధాన్యాన్ని ఎక్కువగా పండించాలని, ప్రభుత్వం క్వింటాకు రూ.2,320, చెల్లిస్తూ రూ.500 అదనంగా బోనస్ ఇస్తుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, ఏపీడీ శారద, పీడీ రాజ్ కుమార్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మార్కెట్ చైర్మన్ శేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ ఎంపీపీలు భగవాన్ నాయక్, చవ్వా బ్రహ్మానందరెడ్డి, నాయకులు కృష్ణా నాయక్, శాగం పెద్దిరెడ్డి, గడ్డం సాగర్‌రెడ్డి, ముని నాయక్, వెంపటి శ్రీనివాస్, యాదగిరిరెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీలో తెలంగాణ ఆదర్శం

త్రిపురారం: పేదలకు సన్నబియ్యం పంపిణీలో తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. బుధవారం త్రిపురారం మండలం నీలాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఘంటారావు క్యాంపులో రేషన్ దుకాణం వద్ద సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచే విధంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముడిమల్ల బుచ్చిరెడ్డి, అనుముల శ్రీనివాస్ రెడ్డి, ధనావత్ భాస్కర్ నాయక్, గోపగాని మాదవి, అంబటి సోమయ్య, మర్ల చంద్రారెడ్డి, బిట్టు రవి కుమార్, బహునూతలు నరేందర్, ఆలంపల్లి జానయ్య, అంబటి రాము, అనుముల వెంకట్ రెడ్డి, యాదగిరి, బాలకృష్ణ, వీరయ్య, సైదులు, తహసీల్దార్ ప్రమీలా, ఎంపీడీఓ విజయ కుమారి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న సంజయ్

త్రిపురారం: మండల వైద్యాధికారిగా డాక్టర్ మాలోతు సంజయ్ బుధవారం త్రిపురారం పీహెచ్‌సీలో బాధ్యతలు స్వీకరించారు. వేములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఆయన త్రిపురారం మండలానికి డిప్యుటేషన్‌పై వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహించిన డాక్టర్ శంకర్ నాయక్ ఉన్నత చదువుల కోసం వెళ్లారు.

చలివేంద్రం ప్రారంభం


త్రిపురారంలో చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్

త్రిపురారం: మండల కేంద్రంలోని ఎన్నెస్పీ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని త్రిపురారం ఎంపీడీఓ విజయ కుమారి, తహసీల్దార్ గాజుల ప్రమీలా అన్నారు. బుధవారం త్రిపురారం మండల కేంద్రంలోని ఎన్నెస్పీ కార్యాలయం ఆవరణలో త్రిపురారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం కేంద్రాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ దయాకర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ భరద్వాజ్, పంచాయతీ కార్యదర్శి కోడిరెక్క రాజేంద్ర కుమార్, జూనియర్ అసిస్టెంట్ మహేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ సహకారంతో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ ఎంపీపీ దూదిపాల రేఖాశ్రీధర్‌రెడ్డి, ఆర్టీసీ డీఎం రమేష్‌బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద మరొక చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, యుగుందర్‌రెడ్డి, మంగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగులపల్లి: మాడుగులపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఎంపీడీఓ తిరుమలస్వామి, ఎస్ఐ కృష్ణయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, ఎంపీఓ సంగీత, పంచాయతీ కార్యదర్శి ఖాసీం, వెంకన్న, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

మిర్యాలగూడ: సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 13న నిర్వహించే తెలంగాణ జర్నలిస్టు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమ జేఏసీ నాయకుడు అంజన్న కోరారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ జర్నలిస్టు సమ్మేళన వాల్ పోస్టర్‌ను తెలంగాణ జర్నలిస్టు ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ బైరాగితో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాజేందర్, ప్రసాద్, యాదగిరి, బాబన్న, శంకర్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత కమిటీతో బ్లాక్ స్పాట్ల గుర్తింపు


బ్లాక్ స్పాట్లను పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

వేములపల్లి: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం వేములపల్లి మండలంలోని బుగ్గబావిగూడెం, శెట్టిపాలెం, వేములపల్లి గ్రామాల్లో రోడ్డు భద్రత కమిటీతో కలిసి బ్లాక్ స్పాట్లను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు వెంట ఉన్న గ్రామ ప్రజలకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

ముమ్మరంగా దరఖాస్తుల స్వీకరణ

మిర్యాలగూడ: రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి మిర్యాలగూడ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం హెల్ప్‌డెస్క్‌లో దరఖాస్తుల స్వీకరణను ఎంపీడీఓ శేషగిరిశర్మ బుధవారం పరిశీలించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ కరుణాకర్ రావు, సిబ్బంది ఉన్నారు.

దేవరకొండ: అర్హులు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని దేవరకొండ ఎంపీడీఓ డానియల్ అన్నారు. బుధవారం దేవరకొండ ఎంపీడీఓ కార్యాలయంలోరాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఈనెల 14వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు.

త్రిపురారం: రాజీవ్ యువ వికాసానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఎంపీడీఓ కార్యాలయంలోని ప్రజాపాలన డెస్క్‌లో అందజేయాని త్రిపురారం ఎంపీడీఓ విజయ కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు పాస్‌ఫొటో, ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కులం సర్టిఫికెట్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీ అందజేయాలని పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీ వరకు ఆన్‌లైన్ చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ దయాకర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ భరద్వాజ్, జూనియర్ అసిస్టెంట్ మహేష్, సరిత తదితరులు పాల్గొన్నారు.

మాడుగులపల్లి: రాజీవ్ యువ వికాసం పథకానికి యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ తిరుమలస్వామి బుధవారం తెలిపారు. రేషన్‌కార్డు ఉన్న వారు ఆదాయం సర్టిఫికెట్ సమర్పించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులను ఈనెల 14లోపు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

హాలియా: రాజీవ్ యువ వికాసం పథకానికి యువత దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సుజాత తెలిపారు. ఈనెల 14లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బస్‌షెల్టర్ ఎదుట పేరుకుపోయిన చెత్త



పెద్దవూర బస్‌షెల్టర్ ఎదుట ఉన్న చెత్తాచెదారం

పెద్దవూర: మండల కేంద్రంలోని జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై జెడ్పీహెచ్‌ఎస్ పక్కన నిర్మించిన బస్‌షెల్టర్ ఎదుట రోడ్డుపై చెత్తాచెదారం పేరుకుపోయింది. బస్‌షెల్టర్‌లో సైతం దుమ్ముదూళితో కమ్ముకుపోయింది. నిత్యం మండల అధికారులు ఇదే దారిలో వెళ్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డు వెంట పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని కోరుతున్నారు.

రామాలయ అభివృద్ధికి కృషిచేయాలి


ప్రమాణం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): సీతారామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అన్నారు. బుధవారం తిరుమలగిరి మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఆలయ నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా దేవాదాయశాఖ ఈఓ ఆలయ కమిటీ చైర్మన్‌గా శాగం నాగిరెడ్డి, డైరెక్టర్లుగా నల్లబోతు సైదులు, చిక్కం సోమిరెడ్డి, అనుములు సాలయ్య, పిట్టల చంద్రమ్మలతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి , మార్కెట్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ భగవాన్ నాయక్, నాయకులు శాగం పెద్దిరెడ్డి, శ్రవణ్ కుమార్‌రెడ్డి, కృష్ణా నాయక్, మంగమ్మ, పాండు నాయక్ పాల్గొన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని హమాలీ కూలీలకు హాలియా వ్యవసాయ మార్కెట్ యార్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుస్తులను ఆయన పంపిణీ చేశారు.

పాడి రైతుల అభివృద్ధికి తోడ్పాటు హర్షణీయం

హాలియా: పాడి రైతుల సంక్షేమాభివృద్ధికి హాలియా మార్కెట్ కమిటీ, లయన్స్ క్లబ్ తోడ్పాటునందించడం హర్షణీయమని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం అనుముల మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు కర్నాటి లింగారెడ్డి, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, జిల్లా రైస్ మిల్లర్స్ గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వీరమళ్ల శ్రీనివాస్, మార్కెట్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


ఇందిరమ్మ కాలనీలో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ: రాష్ట్రంలోని పేదల ఆకలి తీర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా సన్న బియ్యం అందిస్తోందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీతోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, తహసీల్దార్ హరిబాబు, నూకల వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆసరాగా..

అడవిదేవులపల్లి: పేదల కడుపు నింపేందుకే సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం దామరచర్ల మండలం వాడపల్లి, అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని రేషన్ షాపుల్లో లబ్ధిదారులకు చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. నిరుపేదలకు ఆసరాగా దొడ్డు బియ్యంకు బదులుగా రాష్ట్రంలో మొట్ట మొదటి సారిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేశామన్నారు. కొంత మంది దళారులు కార్డుదారులను తప్పుదోవపట్టించే విధంగా ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు స్కైలాబ్‌నాయక్, బాలునాయక్, గాజుల శ్రీనివాస్, పోదిల శ్రీను, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రమేష్, ఆర్ఐ శ్యాంకుమార్, ఎస్ఐ శేఖర్ తదితరులున్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

అడవిదేవులపల్లి: నల్లగొండలో నిరుద్యోగ యువతీ, యువకుల కోసం నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని అడవిదేవులపల్లి ఎస్ఐ శేఖర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి గల వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 5న పోలీస్ స్టేషన్ నుంచి నల్లగొండ జిల్లా కేంద్రానికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

5న జాబ్‌మేళా

నిడమనూరు: యువత ఉపాధికోసం నల్లగొండ జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో ఈనెల 5న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ జే గోపాల్‌రావు తెలిపారు. నల్లగొండ పోలీస్ పరడ్ మైదానంలో నిర్వహించే జాబ్‌మేళాలో వందకు పైగా కంపెనీలు వస్తాయని, 2500 ఉద్యోగాలు భర్తీ చేస్తారని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి, డిగ్రీ, ఇంజనీరింగ్, ఐటీఐ, డిప్లొమా విద్యార్థులు జాబ్‌మేళాకు హాజరుకావచ్చని ఎస్ఐ తెలిపారు.

హాలియా : జిల్లా కేంద్రంలో ఈనెల 5న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు హాలియా ఎస్ఐ సతీష్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జాబ్ మేళా ఉంటుందని పేర్కొన్నారు. అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు సెల్ నంబర్ 87126 70194ను సంప్రదించాలని కోరారు.

పెద్దవూర: నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ పి.వీరబాబు బుధవారం తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

కొండమల్లేపల్లి: నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈనెల 5న ఎస్పీ శరత్ చంద్రపవార్ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా జాబ్ మేళాను యువత, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ రామ్మూర్తి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నిరుద్యోగ యువత తమ వివరాలను దరఖాస్తు ఫారంలో నింపి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమర్పించాలని తెలిపారు.